క్లుప్తంగా

టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు



సభ్యత్వం స్వీకరిస్తున్న జర్నలిస్టులు

మధిర: అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇల్లు, ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ సభ్యుడు పాగి బాలస్వామి కోరారు. మధిరలో మంగళవారం యూనియన్ సభ్యత్వ నమోదును ప్రారంభించగా తొలి సభ్యత్వాన్ని స్వీకరించిన బాలస్వామి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజీవ్ యువ వికాసంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు రైల్వే పాస్‌లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు తనికెళ్ల ప్రీమియర్ లీగ్ సోమవారం రాత్రి ముగిసింది. ఈ పోటీల్లో ఉభయ రాష్ట్రాలకు చెందిన 10 జట్లను ఆహ్వానించగా పోటీలు రసవత్తరంగా సాగాయి. చివరకు ఫైనల్‌లో పెరిక కౌసల్య మెమోరియల్ కొణిజర్ల (నల్లగొండ) జట్టు, కోసూరీ యూత్ బస్వాపురం (ఖమ్మం) జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో తనికెళ్ల గ్రామశాఖ సభ్యులు, బహుమతి దాతలు పాల్గొన్నారు.

మక్కల కొనుగోళ్లు ప్రారంభించాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

వైరారూరల్: ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో కల్లాల్లో అరబోసిన మక్కలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రకటించి 20రోజులు దాటినా ఇప్పటివరకు ఆ ఊసే లేదన్నారు. దీంతో రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాజా, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ఇన్‌చార్జ్ ఈఓగా రజినీకుమారి

పాల్వంచరూరల్: పెనుబల్లిలోని శ్రీ నీలాద్రీశ్వర ఆలయ(శివాలయం) ఇన్‌చార్జ్ ఈఓగా ఎస్.రజినీకుమారికి బాధ్యతలు అప్పగించారు. ఆలయ ఈఓగా ఉన్న పీ.వీ.రమణను అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. దీంతో పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ రజినీకుమారికి నీలాద్రీశ్వర ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించగా, మంగళవారం ఆమె విధుల్లో చేరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బోనకల్: మండలంలోని రామాపురం గ్రామం వద్ద అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్సై మధుబాబు పట్టుకున్నారు. చింతకాని మండలం చిన్న మండవ మున్నేటి నుంచి బోనకల్ మండలం రామాపురం గ్రామానికి తరలిస్తుండగా.. వాటిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీకాంత్ మృతి పార్టీకి తీరని లోటు



శ్రీకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్ మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జోగయ్య, బసవయ్య, నాగుల్‌మీరా, సుబ్బారెడ్డి, మహేష్, నగేష్, తదితరులున్నారు.

వరికోతలు ముమ్మరం

- హార్వెస్టర్ల ద్వారానే కోతలు
- 22వేల ఎకరాల్లో వరిసాగు
- మండలంలో 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తేమశాతం పేరుతో జాప్యం
- కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత



గొల్లగూడెంలో హార్వెస్టర్ ద్వారా కైలు చేస్తున్న దృశ్యం

తల్లాడ: రబీ సీజన్లో సాగు చేసిన వరిపైరు కోతకొచ్చింది. రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. హార్వెస్టర్ల ద్వారానే కోతలు నడుస్తున్నాయి. గతంలో కూలీల చేత వరి కోతలు కోయాలంటే చాలా సమయం పట్టేది. ఇప్పుడు యంత్రాలు వచ్చిన తర్వాత కొన్ని గంటల్లోనే వరి కోస్తున్నారు. తల్లాడ మండలంలో గత వారం రోజుల నుంచి వరి కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. రబీలో దిగుబడి కూడా బాగానే వస్తుంది.

22 వేల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది రబీలో వెదజల్లే పద్ధతి, నాటు వేసే పద్ధతి ద్వారా మండలంలో 22వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. ఈసారి ఎక్కువగా హెచ్ఎంటీ సోనా, 126 సన్న రకాలను సాగు చేశారు. నాగార్జున సాగరు కాల్వలు, చెరువులు, కుంటల కింద వరిపైరు సాగు చేశారు. ఈ ఏడాది సాగర్‌లో నీరు ఉండటం వల్ల సాగు చేసిన ప్రతి ఎకరాకు సాగు నీరందింది.

హార్వెస్టర్ల ద్వారానే..

హార్వెస్టర్ల ద్వారా రైతులు వరి కోయిస్తున్నారు. టైర్లు, చైన్‌బండితో ఎక్కువగా కోతలు జరుగుతున్నాయి. దీంతో వరి గడ్డి కూడా కట్టలు కట్టే హార్వెస్టర్ వచ్చింది. టైర్ల బండికి గంటకు 2వేలు, చైన్‌బండికి రూ.3వేలు రైతులు చెల్లిస్తున్నారు. వరిగడ్డి కట్టలు కట్టే మిషన్‌కు కట్టకు రూ.30 చొప్పున చెల్లిస్తున్నారు. రబీ వరిపైరులో దిగుబడి గణనీయంగానే ఉంది. ఎకరానికి 24 నుంచి 32 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రైతులు ఎకరాకు రూ.20వేలు నుంచి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఈ సారి చీడపీడలు పెద్దగా ఆశించకపోవడంతో దిగుబడి బాగానే ఉంది.

దిగుబడి పెరిగింది..



కోతకు వచ్చిన వరిపంట

కల్లూరు: వరిసాగుకు కేంద్రంగా మారిన కల్లూరు మండలంలో రబీ సీజన్‌లో రైతులు ఊహించని విధంగా దిగుబడులు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నాగార్జున సాగర్ ఆయకట్టు, చెరువులు, కుంటలు, మోటార్ల కింద సుమారుగా 33,850 ఎకరాల్లో వరి సాగవుతుంది. సత్తుపల్లి డివిజన్‌లోనే అత్యధికంగా వరి సాగు అయ్యే మండలంగా కల్లూరు మండలానికి పేరుంది. ఈ మండలంలో సుమారుగా 24 కిలోమీటర్ల మేరకు విస్తరించిన భూముల్లో వరి పంటనే ఎక్కువ సాగు చేయడం విశేషం. ఈ సారి రైతులు పీఆర్ 126 రకం, ఎంటీయూ 1010 ఎక్కువగా సాగు చేశారు. కేఎన్ఎమ్ 1638, హెచ్ఎంటీలు తక్కువగా సాగు చేశారు. ఇప్పటికే కొన్ని చోట్ల వరికోతలు కోయగా.. పలుచోట్ల ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ క్వింటా ధాన్యానికి రూ.2,320, కామన్‌గ్రేడ్‌కు రూ.2,300 ఇస్తున్నారు. ఎకరానికి 40 బస్తాల నుంచి 65 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి.

గన్నీ సంచుల కొరత, కొనుగోళ్లలో జాప్యం..

మండలంలో ఏర్పాటు చేసిన 24 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత కనిపిస్తోంది. సంచులివ్వకుండా తేమశాతం పేరుతో కొన్ని కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. తల్లాడ సొసైటీ, ఐకేపీ కేంద్రాల వద్ద గత 15 రోజులు ఎండబెట్టిన వడ్లు తేమశాతం 17వచ్చినా కొనటం లేదని రైతులు వాపోతున్నారు.

అధికారులు జోక్యం చేసుకోవాలి..



నేను రెండెకరాల్లో వరి సాగు చేయగా.. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ధాన్యం విక్రయించేందుకు తల్లాడ సొసైటీలో ధాన్యం అరబోసి ఉంచాను. తేమశాతం వచ్చినా జాప్యం చేస్తున్నారు. అధికారులు జోక్యం చేసుకొని వెంటనే కొనుగోలు చేయాలి.

– పరుచూరి కృష్ణ, రైతు, నారాయణపురం

హార్వెస్టర్ ద్వారానే కైలు చేయించా..



హార్వెస్టర్ ద్వారా వరి కైలు చేసి తల్లాడ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబోశాను. తేమశాతం 17వచ్చినా కాంటా వేయటం లేదు. గన్నీ సంచుల కొరత ఉందంటూ.. సంచులివ్వట్లేదు. దీంతో కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

– శీలం వెంకటేశ్వరరెడ్డి, రైతు, కిష్టాపురం

లావు రకం అని కొనటం లేదు..



15 రోజుల క్రితం సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం కల్లంలో ధాన్యాన్ని ఆరబెట్టాను. లావు రకం అని కొనకుంటా.. సన్నరకాలకు మాత్రమే కాటా వేస్తున్నారు. లావురకం ధాన్యాన్ని ఐకేపీ కేంద్రం వద్దకు తీసుకెళ్లమంటున్నారు. ఎండలో వడ్లను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నాం.

– చల్లా శివమ్మ, తల్లాడ

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వైరా: ఎన్నికల సమయాన ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు పేర్కొన్నారు. వైరాలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందితే, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ధాన్యం రైతులు నష్టపోతున్నారన్నారు. కాగా, ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బాణాల వెంకటేశ్వర్లు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, ముళ్లపాటి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆర్‌యూబీ

మధిర: రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా మధిర పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి దారిని కొద్ది నెలల క్రితం మూసివేశారు. దీంతో వన్‌టౌన్ నుంచి టూ టౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో 3వ లైన్ నిర్మాణ పనులు పూర్తికావడంతో విస్తరించిన రైల్వే అండర్ బ్రిడ్జి దారిని మంగళవారం నుంచి పునరుద్ధరించారు. కొద్ది నెలలుగా రాకపోకలు నిలిచిపోవడంతో లడక బజార్, ఆర్‌సీఎం చర్చి ప్రాంతంలో ఉన్న దుకాణాలు వెలవెలబోయాయి. ఎట్టకేలకు రైల్వే అండర్ బ్రిడ్జి దారి ప్రారంభం కావడంతో ప్రజలతో పాటు ఆ ప్రాంత దుకాణదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నరసింహారావు, తదితరులు

మధిర: వంగవీడు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఐలూరి సత్యనారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫైర్ విన్యాసాలు



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మంగళవారం సత్తుపలి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఫైర్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రివాల్వింగ్ బ్రాంచ్, మల్టీ పర్పస్ బ్రాంచ్‌లతో పరిశ్రమల్లో మంటలను ఆర్పే విధానాన్ని ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, వీబీఓ ఆనంద్, ఫైర్ ఉద్యోగులు మోషేబాబు, వీరబాబు, బాబురావు, సతీష్, బసవయ్య, రవికాంత్ పాల్గొన్నారు.

వైభవంగా గురువమ్మతల్లి కల్యాణం



శ్రీగురువమ్మతల్లి – సర్వారెడ్డి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీగురువమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా సాగుతుంది. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమైన జాతరలో.. సోమవారం రాత్రి శ్రీగురువమ్మతల్లి – సర్వారెడ్డి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర భక్తుల కోలాహల నడుమ మార్మోగిపోయింది. 15వ తేదీ మంగళవారం సాయంత్రం పూల కప్పెర ఘనంగా నిర్వహించారు. 16వ తేదీన సాయంత్రం 6గంటలకు గ్రామ ప్రభలు, 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి భోనాల సమర్పణతో జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎర్రుపాలెంలో అభిషేకం..



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శ్రీదాసాంజనేయ స్వామి వారి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ఆలయ అర్చకులు కొత్తూరి రాజేశ్వరశాస్త్రి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. తొలుత గణపతి పూజ, అనుష్టానాలు, వేద పారాయణం చేశారు. శాస్త్రోక్తంగా మూల మంత్ర హోమాలు నిర్వహించారు. వైభవోపేతంగా శ్రీసీతారామస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని భక్తులు కన్నులపండువగా తిలకించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిత్యావసరాలు పంపిణీ..



నిత్యావసరాలు అందిస్తున్న ఫాదర్ రమేష్, మదర్ థెరిస్సా సేవా సభ్యులు

కొణిజర్ల: మండలంలోని పెద్దమునగాలలో మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో లింగాల జీవమ్మ, తలారి భాగ్యమ్మ కుటుంబాలకు మంగళవారం నిత్యావసర వస్తువులను అందించారు. పెద్దగోపతి విచారణ కర్తలు ఫాదర్ కిన్నెర రమేష్, అబ్రహం పంతులు చేతుల మీదుగా ఈ సరుకులను అందించారు. ఇటీవల మృతి చెందిన కందుల ప్రవీణ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

కల్లూరురూరల్: అకాల వర్షం.. గాలి వల్ల గృహాలు దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు డీపీఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత దేవరపల్లి పట్టాభి ఆర్థిక సాయం అందించారు. లింగాల గ్రామానికి చెందిన తేళ్లూరి వెంకట్, తేళ్లూరి గోపాలు, తేళ్లూరి రవి, దేవా, తేళ్లూరి సర్వేశ్వరరావుల గృహాలు పూర్తిగా దెబ్బతినడంతో ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలు నగదు ఆర్థిక సాయం చేయగా.. ఆ నగదును ఆయన తండ్రి నాగప్రసాద్ బాధితులకు అందించాడు. అదే విధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన దుర్గం ఏడుకొండల కుటుంబానికి రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో దేవరపల్లి భాస్కర్‌రావు, మాజీ ఎంపీటీసీ వేణు, కృష్ణ, చెరుకూరి మోహన్‌రావు, మద్దినేని సత్యనారాయణ, మట్టూరి శ్రీనివాసరావు, దేవరపల్లి వెంకటరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో పేదల జీవితాల్లో వెలుగులు



రాయన్నపేటలో భోజనం చేస్తున్న దుర్గాప్రసాద్ తదితరులు

బోనకల్: సన్న బియ్యం పథకంతో పేదవాళ్ల జీవితాల్లో వెలుగులు రావడం ప్రారంభమయ్యాయని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని రాయనపేట గ్రామంలో మంగళవారం సన్న బియ్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలోని చింతకాయల వెంకన్న ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ లు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి అభినందనలు వెల్లువ పోటెత్తుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, మధిర సీఐ మధు, తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ ఆర్.రమాదేవి, ఎస్ఐ మధుబాబు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి



కిరణ్మయి కుటుంబానికి చెక్కు అందిస్తున్న రవి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులకు విద్యను దూరం చేసే జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి పిలుపునిచ్చారు. మంగళవారం సత్తుపల్లిలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పిల్లలందరికీ సమానమైన విద్యనందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. అనంతరం గత నెలలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు హసావత్ కిరణ్మయి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పథకం ద్వారా రూ.6 లక్షల చెక్కును అందించారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బుర్రి రాజు, జిల్లా కార్యదర్శులు డి.ఉమామహేశ్వరరెడ్డి, వి.రామారావు, కె.నిర్మలకుమారి, మండలాల బాధ్యులు చెరుకు శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రావు, ఈశ్వరాచారి, హనుమంతు ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది బీఆర్ఎస్సే..



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ కృష్ణయ్య, గాదె చెన్నారావు

సత్తుపల్లిటౌన్: మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని డీసీసీబీ డైరెక్టర్ కృష్ణయ్య, సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు విమర్శించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు తెరమీదకు తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఉనికికోసం మూడునెలకోసారి నియోజకవర్గానికి వచ్చే నాయకులు చౌకబారు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, ఎండీ కమల్‌పాషా, పింగళి సామేలు, అర్వపల్లి సందీప్‌గౌడ్, మట్టా చెన్నారావు, గఫార్‌ఖాన్, సారథి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



మీనవోలులో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామం నుంచి తక్కెళ్లపాడు, సఖినవీడు తదితర గ్రామాల మీదుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు మాట్లాడుతూ.. జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ నినాదంతో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామని, గడపగడపకు రాజ్యాంగ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తల్లపురెడ్డి నాగిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, వేమిరెడ్డి అనురాధ, మల్లెల లక్ష్మణరావు, కడియం శ్రీనివాసరావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, కోటపాటి రంగారావు, పిలిప్, తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(వ్య.కా.స) రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గంగారంలో ఉపాధిహామీ కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు ఉండాలని, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ రేట్లు పెంచుతుంది కానీ.. కూలీలకు మాత్రం వేతనాలు పెంచడంలేదన్నారు. ప్రమాదాలు, ఇతర కారణాలతో మరణాలు, గాయపడిన కూలీలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఉపాధి పనులను పర్యవేక్షించే ఫీల్డ్ అసిసెంట్లకు కూడా మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే వారికి చెల్లింపులు జరగాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, జ్యోతి, సత్యం, మరియమ్మ, వెంకటేశ్వరరావు, రాజు, పుష్పావతి, అలివేలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అంజలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు

తల్లాడ: మండలంలోని తెలగవరంకు చెందిన మారుతీ అంజలీకి మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేతుల మీదుగా చెక్కు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముప్పా మురళి, కేతినేని చలపతిరావు, దిరిశాల దాసురావు, వెంకట్రావు పాల్గొన్నారు.

నేలమట్టమైన రైస్‌మిల్లు షెడ్డు పరిశీలన

తల్లాడ: అకాల వర్షానికి నేలమట్టమైన కుర్నవల్లి సొసైటీ రైస్‌మిల్లు షెడ్డును మంగళవారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎస్.కె.లాల్ మియా పరిశీలించారు. 2020 సంవత్సరంలో కుర్నవల్లిలో నాబార్డు నిధులతో రూ.57 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించారు. రైస్‌మిల్లుకు చెందిన ఈ షెడ్డు ప్రారంభం కాకుండానే నాణ్యతా లోపం కారణంగా కూలిపోయింది. వారం రోజుల క్రితం కేశవాపురంలో డబుల్ బెడ్ రూమ్ మెట్లు కూలిపోయాయి. గత బీఆర్ఎస్ పాలనలో నిర్మించినప్పుడు జరిగిన అవినీతి కారణంగా కూలిపోతున్నట్లు ఆరోపించారు. నాయకులు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.

భానుడి భగ భగ.. నీడకు చేరిన జీవాలు



వేపచెట్టు కింద సేదదీరుతున్న జీవాలు

ముదిగొండ: రోజు రోజుకు పెరుగుతున్న వేసవి తీవ్రతకు మనుషులతో పాటు జీవాలు తట్టుకోలేక పోతున్నాయి. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని భగ భగలాడిస్తున్నాడు. దీంతో బయటకు రావాలంటే బయపడుతున్నారు. అత్యవసరమైన వారు తప్ప మిగిలిన వారు ఇంటికే పరిమితమవుతున్నారు. దీంతో పొలాలకు మేతకు వెళ్లే పశువులు, జీవాలు ఎండ తీవ్రతకు అల్లాడుతూ.. నీడ కోసం తాపత్రయం పడుతున్నాయి. ఎక్కడ చెట్టు కనిపించినా సేద దీరుతున్నాయి. ముదిగొండ మండలం పెద్దమండవ – గంధసిరి రహదారికి పక్కనే ఓ వేపచెట్టు కిందకు జీవాలు చేరి సేదతీరుతున్నాయి.